క్లుప్తంగా...

డిప్లొమా కోర్సుల ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వివిధ డిప్లొమా కోర్సుల ప్రవేశాల 2023–24కు నోటిఫికేషన్ జారీ చేసినట్లు రిజిస్ట్రార్ వెంకటరమణ తెలిపారు. ఈ కోర్సుల కౌన్సెలింగ్‌ను జూలై మొదటి వారంలో ఉంటుందని పాలిసెట్ ర్యాంకుల అనుసరించి మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. ఈ నెల 26 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విద్యుత్ సమస్యలపై ఈ నెల 15న సమావేశం

రాజేంద్రనగర్ : విద్యుత్ వినియోగదారుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించేందుకు ఈ నెల 15వ తేదీన సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రాజేంద్రనగర్ డివిజన్‌లో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో సీజీఆర్ఎఫ్ చైర్ పర్సన్, మెంబర్ టెక్నికల్, మెంబర్ ఫైనాన్స్, వినియోగదారులు హాజరవుతారని విద్యుత్ సమస్యలు, బిల్లుల్లో హెచ్చుతగ్గులు తదితర వాటిని పరిష్కరించుకోవాలని సూచించారు.

ఎంజీఐటీలో నేటి నుంచి సదస్సు

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ)కళాశాలలో శుక్ర, శనివారాలలో సివిల్ ఇంజినీరింగ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ అనే థీమ్‌తో సస్టైనబుల్ టెక్నాలజీస్ ద్వారా సివిల్ ఇంజనీరింగ్‌లో ఆవిష్కరణలు అనే అంశంపై జాతీయ సదస్సును నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ జి. చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. సివిల్ ఇంజనీరింగ్ రంగంలో స్థిరమైన అభివృద్ధిని పెంపొందించే ఆలోచనలను అందించటానికి, భవిష్యత్ అవసరాలను చర్చించటానికి ఈ వేదిక ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు.

అన్ని రోడ్లను అభివృద్ధి చేస్తాం



రోడ్డు పనులను ప్రారంభించిన శ్రీకాంత్‌రావు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ కేంద్రం 6వ వార్డులోని అన్ని రోడ్లను దశల వారీగా అభివృద్ధి చేసి ఆదర్శవార్డుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని కౌన్సిలర్ పత్తి శ్రీకాంత్‌రావు అన్నారు. గురువారం ఆయన మైనార్టీ బస్తీలో రూ.22 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ప్రారంభించి మాట్లాడారు. తన వార్డు పరిధిలో ఇప్పటికే పలు రోడ్లను అభివృద్ధి చేశామని మిగిలిన రోడ్లను నిధుల లభ్యతను బట్టి చేపడతామన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో రోడ్లకు ప్రాధాన్యం ఇచ్చి నిధులను ఖర్చు చేస్తున్నామన్నారు.

ఉన్నత విద్యకు సహకరిస్తాం



విద్యార్థినుల అభినందిస్తున్న నాయకులు

మణికొండ: పదిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినుల ఉన్నత విద్యకు తమ వంతు సహకారం అందిస్తామని మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి అన్నారు. మణికొండ ప్రభుత్వం పాఠశాల విద్యార్థులు మహేశ్వరి 9.7, నిత్యా 9.3 సాధించగా గురువా రం వారిని ఆయన అభినందించారు. మహేశ్వ రి ఇంటర్ విద్యకు అయ్యే ఖర్చును తాను భరిస్తానని రామకృష్ణారెడ్డి, నిత్యాను ఎ.లక్ష్మణ్‌రావు, దిలీప్ కక్కడ్ చదివిస్తామని హామీ ఇచ్చారు. మణికొండలోని శ్రీ చైతన్య కళాశాల ప్రిన్సిపల్‌ను కలిసి వారి ఉన్నత చదువులకు సహకరించాలని కోరటంతో ఫీజును తగ్గించి ఎంపీసీలో చేర్చుకున్నారు.

చేప ప్రసాదానికి వచ్చే వారికి ఉచితంగా ఆహారం

చార్మినార్: చేప ప్రసాదం కోసం ఇతర రాష్ట్రాలతో పాటు జిల్లాల నుంచి నగరానికి చేరుకున్న ప్రజలకు టీఎస్ బసవ కేంద్రం అధ్యక్షులు నాగ్‌నాథ్ మాశెట్టి ఆధ్వర్యంలో గురువారం ఉచితంగా ఆహారం అందజేశారు. ఉదయం టీ, టిఫిన్‌లతో పాటు మధ్యాహ్నం భోజనాలను అందజేశారు. పాతబస్తీ కోకర్‌వాడీకి చెందిన నాగ్‌నాథ్ మాశెట్టి ఆధ్వర్యంలోని ప్రతినిధుల బృందం ఈ ఆహార పదార్థాల పంపిణీలో చురుకుగా పాల్గొన్నారు. ముందుగా బసవేశ్వర చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించిన అనంతరం ఆహార పదార్థాల పంపిణీ కొనసాగింది. ఈ సందర్భంగా నాథ్‌నాగ్ మాశెట్టి మాట్లాడుతూ... గత కొన్నేళ్లుగా చేప ప్రసాదానికి వచ్చే ప్రజల సౌకర్యార్థం ఉచితంగా ఆహార పదార్థాలను అందజేస్తున్నామని అన్నారు. అందులో భాగంగా ఈసారి కూడా అందజేసినట్లు ఆయన తెలిపారు. ఉదయం 7గంటలకు ప్రారంభమైన ఆహార పదార్థాల పంపిణీ రాత్రి 7 గంటల వరకు కొనసాగింది. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లి రాంచందర్, హెచ్‌యూజే ఉపాధ్యక్షులు రమేశ్‌లతో పాటు వీర శైవ లింగాయత్ మహిళా నాయకురాలు పల్లె వీరమణి, దినేశ్ పట్నీ, ధర్మేందర్ పూజారి, నాగరాజు శిల్వంత్, బాబు మాశెట్టి, ప్రశాంత్ మాశెట్టి, రమేశ్ పాల్గొన్నారు.

హైవే స్థలం.. అక్రమార్కుల వశం

అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అక్రమార్కులు యథేచ్ఛగా ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తున్నారు. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే జాతీయరహదారి స్థలానికే ఏసరు పెడుతున్నారు. దాదాపుగా రెండు వేల గజాల స్థలం అక్రమార్కులు తమ ఆధీనంలోకి తీసుకునేందుకు పావులు కదుపుతున్నారు. స్థలాన్ని కాపాడుకోవాల్సిన ఆర్అండ్‌బీ నిర్లక్ష్యంగా వ్యవహరించడమే అక్రమార్కులకు వరంగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. –శంషాబాద్



రాత్రికి రాత్రే హైవే స్థలంలో వెలసిన నిర్మాణాలు

- యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు
- కబ్జా చేసి నిర్మాణాలు మరూ
- దృష్టి సారించని అధికారులు
- రెచ్చిపోతున్న అక్రమార్కులు

ప్రైవేటు సర్వే చేయించుకుని..

పట్టణంలో సిద్ధాంతి రైల్వేగేటు సమీపంలో జాతీయ రహదారి విస్తరణ కోసం గతంలో భూమిని కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి భూసేకరణ జరిపింది. భూములు కోల్పోయిన వారు అక్కడి నుంచి ఖాళీ చేశారు. హైవేకు మధ్యభాగం నుంచి ఇరువైపులా వంద ఫీట్లు (ముప్పై మీటర్ల)చొప్పున హైవేకు సంబంధించిన స్థలంగా నిర్ధారించారు. శంషాబాద్‌కు వెళ్లే కుడివైపు మార్గాన్ని పూర్తి చేసిన ఆర్అండ్‌బీ అధికారులు ఎడమ వైపు మాత్రం విస్తరించకుండా అలాగే వదిలేశారు. ఇదే అదునుగా భావించిన కొందరు ఈ స్థలంపై కన్నేశారు. ఏకంగా ప్రైవేటు సర్వేను కూడా చేయించుకుని హైవే స్థలానికి చివరగా ఉన్న రైల్వే గోడను ఆనుకుని నిర్మాణాలు ప్రారంభించారు.

వారి అండతోనేనా?

ఇప్పటికే ఓ గదిని నిర్మాణం చేసి ఓ డబ్బాను కూడా ఏర్పాటు చేశారు. అక్రమంగా ఏర్పాటవుతున్న నిర్మాణంతో పాటు డబ్బాలకు వేసినా మున్సిపల్ అధికారులు సైతం అటువైపు చూడకపోవడంతో మొత్తం స్థలాన్ని తమ ఆధీనంలోకి తీసుకునేందుకు రాత్రికి రాత్రే పనులు చేపడుతున్నారు. ఇక్కడ సుమారు పది హేనేళ్లుగా ప్రభుత్వ స్థలంలో ఉన్న హోర్డింగ్ డబ్బులను సైతం ప్రైవేటు వ్యక్తుల జేబుల్లో వెళుతున్నాయనే ఆరోపణలు కూడా ఉన్నాయి. హైవే స్థలంలో ఉన్న హోర్డింగ్‌ను సైతం అధికారులు తొలగించాల్సి ఉంది. స్థానికంగా కొందరు ప్రజాప్రతినిధుల అండతోనే వీరు అక్రమ నిర్మాణాలను చేపడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వానికి చెందిన రోడ్డు స్థలాన్ని కబ్జా నుంచి కాపాడి పట్టణ వాసులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

హైవేకు మధ్యభాగం నుంచి ఇరువైపులా వంద ఫీట్లు (ముప్పై మీటర్లు) స్థలం హైవేకు చెందినది. హైవే ప్రాంతాన్ని పూర్తిగా పరిశీలించి అందులో ఉన్న నిర్మాణాలను తొలగిస్తాం. అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలతో పాటు కేసులు నమోదు చేస్తాం.

–ధర్మారెడ్డి, ఈఈ ఆర్అండ్‌బీ

ఆచార్యులకు శిక్షణ తరగతుల ప్రారంభం



మాట్లాడుతున్న లింగం సుధాకర్‌రెడ్డి

బండ్లగూడ: మంచి ఆచార్యులు, మంచి విద్యార్థుల ద్వారా మంచి సమాజం నిర్మాణం అవుతుందని విద్యా భారతి దక్షిణ మధ్య క్షేత్ర సంఘటనా కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శారదా దామంలో విద్యారణ్య ఆవాస విద్యాలయాల్లో సేవలు అందిస్తున్న ఆచార్యులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. గురువారం లింగం సుధాకర్‌రెడ్డి హాజరై తరగతులను ప్రారంభించి మాట్లాడారు. స్వాతంత్రం వచ్చిన తదుపరి మనదైన విద్యా వ్యవస్థను ఏర్పరచుకుని, మన విలువలను అందించాలని ఆనాడు భావించామని కానీ వారి ఆశలు, ఆశయాలు సఫలీకృతం కాలేదన్నారు. స్వాతంత్రం వచ్చిన తరువాత పూర్తిగా ఆగిపోకపోగా మరింత వేగంగా జరిగిందన్నారు. అందుకే విద్యా రంగంలో ఏవైతే వికృతులు చోటు చేసుకున్నాయో ఆ వికృతులను సవరించేందుకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రేరణతో పరమ పూజని గురుజీ మార్గదర్శనంలో 1952లో ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్పూర్‌లో శ్రీ సరస్వతీ శిశు మందిర ఉద్యమం ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా భారతీ దక్షిణ క్షేత్ర కార్యదర్శి లక్ష్మణరావు, శ్రీ సరస్వతీ విద్యా పీఠం ప్రాంత సంఘటనా కార్యదర్శి పతకమూరి శ్రీనివాసరావు, భాగ్యనగర్ విభాగ్ కార్యదర్శి రవీంద్రశర్మ, విభాగ్ కోశాధికారి మధుసూధన్ పాల్గొన్నారు.

ముంపు సమస్యను నివారిస్తాం



బాక్స్ డ్రెయిన్ పనులను ప్రారంభించిన ప్రజాప్రతినిధులు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో లోతట్టు ప్రాంతాలలో నిలిచే వరద నీటితో పాటు పై ప్రాంతాల నుంచి వస్తున్న వర్షం నీటితో ఏర్పడుతున్న ముంపును పూర్తిస్థాయిలో నివారించే క్రమంలో పెద్ద ఎత్తున నిధులతో పనులను చేపడుతున్నామని మణికొండ మున్సిపాలిటీ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్ అన్నారు. గురువారం ఆయన వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డితో కలిసి పంచవటి కాలనీలోని పందెన్‌వాగుకు రూ.9.80కోట్ల నిధులతో ఎస్ఎన్‌డీపీ పథకం కింద మిగిలిపోయిన బాక్స్ డ్రైన్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలోనే పంచవటి కాలనీలో కోట్లాది నిధులను ఖర్చు చేసి చాలా వరకు ముంపు సమస్యను నివారించామన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అంజలిగార్డెన్, మణికొండ గార్డెన్, సెక్రటేరియట్ కాలనీ, వేంకటేశ్వర కాలనీల్లో వరద ముంపు లేకుండా ఇప్పటికే పైప్‌లైన్ సామర్థ్యాలను పెంచే పనులను చేపట్టామన్నారు. మిగిలి ఉన్న మరికొన్ని కాలనీల్లోనూ త్వరలోనే చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, వసంతరావు, డీఈ దివ్యజ్యోతి, ఏఈ సాయిమానిక, కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్ పాల్గొన్నారు.

ఎవరి వద్దా డబ్బులు వసూలు చేయలేదు

డాక్టర్ ప్రభాకర్



విలేకరులతో మాట్లాడుతున్న డాక్టర్ ప్రభాకర్, ఎంపీటీసీ ఎల్లయ్య

శంషాబాద్ రూరల్: కాన్పు కోసం డబ్బుల వసూలు చేసినట్లు పత్రికలో వచ్చిన కథనంలో ఎలాంటి వాస్తవం లేదని పెద్ద షాపూర్ పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సీహెచ్ ప్రభాకర్ తెలిపారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. పీహెచ్‌సీలో తన డ్యూటీ సమయం ముగిసిన తర్వాతనే పట్టణంలోని క్లినిక్‌లో ఉంటానని సుల్తాన్‌పల్లికి చెందిన గర్భిణి దీపికకు పీహెచ్‌సీలో వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఆదివారం అర్ధరాత్రి తర్వాత దీపికను అత్యవసర సమయంలో తన క్లినిక్‌ను తీసుకొస్తే తెల్లవారుజామున కాన్పు జరిగిందని, వారిని తర్వాత పీహెచ్‌సీకి పంపించానన్నారు. బాధితులు సైతం ఎవరికీ ఫిర్యాదు చేయకున్నా తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ వార్త రాయడం బాధాకరమన్నారు. కొంతమంది కావాలని డాక్టర్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఎంపీటీసీ చెక్కల ఎల్లయ్య అన్నారు.

జోరందుకున్న చేపల విక్రయాలు



బుద్వేల్‌లో చేపలు విక్రయిస్తున్న దృశ్యం

రాజేంద్రనగర్: మృగశిర కార్తె సందర్భంగా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో చేపల విక్రయాలు జోరందుకున్నాయి. గురు, శుక్రవారం రెండు రోజుల పాటు మృగశిరకార్తె కావడంతో సర్కిల్ పరిధిలోని మధుబన్ కాలనీ, కాటేదాన్, ఉడ్డెంగడ్డ, మైలార్‌దేవ్‌పల్లి, సాయిబాబానగర్, ఆరాంఘర్, బుద్వేల్, శివరాంపల్లి, రాజేంద్రనగర్, హైదర్‌గూడ, ఉప్పర్‌పల్లి తదితర ప్రాంతాల్లో తాత్కాలికంగా విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గత సంవత్సరం కన్నా ఈ సారి పెద్ద ఎత్తున చేపల విక్రయ కేంద్రాలు కనిపించాయి. ఉదయం నుంచే ఈ కేంద్రాల వద్ద ప్రజలు కొనుగోలు చేసేందుకు బారులు తీరారు. బొచ్చ, రవ్వ, బంగారు తీగ, కొర్రమీన తదితర రకాల చేపలను రూ.200–700 వరకు విక్రయించారు. మృగశిర కార్తె రోజు చేపలను తినాలనే నానుడితో ప్రజలు పెద్ద ఎత్తున వీటిని కొనుగోలు చేశారు.

పెయింటింగ్, రంగోలి పోటీలు అదుర్స్

- హెచ్‌సీయూలోని కేంద్రీయ విద్యాలయలో నిర్వహణ



రంగోలీ పోటీలో పాల్గొన్న విద్యార్థినులు



పోస్టర్ తయారు చేసి ప్రదర్శిస్తున్న విద్యార్థిని

రాయదుర్గం: విద్యార్థుల ప్రతిభ అదుర్స్ అనిపించింది. చిత్రలేఖనం, రంగోలిలో రంగురంగుల చిత్రాలు, పర్యావరణం, జంతువులు, పక్షుల పరిరక్షణ, ఇతర పలు అంశాలపై వారు గీసిన చిత్రాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అంతేకాకుండా విద్యార్థినులు రంగురంగులతో వేసిన ముగ్గులు కూడా అందరినీ ఆకర్షించాయి. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలోని కేంద్రీయ విద్యాలయలో 'జనభాగదారి పక్షం' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్య క్రమాన్ని ఈనెల 15వ తేదీ వరకు నిర్వహిస్తారు. ముఖ్యంగా పోస్టర్ల తయారీ, ఆకట్టుకునే నినాదాలు, ఉపన్యాసాలు, రంగోలి, చిత్రలేఖనం వంటి అంశాలపై పోటీలు నిర్వహిస్తున్నారు. కేంద్రీయ విద్యాలయలోని 8,9,10 తరగతి చదివే విద్యార్థులకు నూతన జాతీయ విద్యా విధానం, పర్యావరణ పరిరక్షణ, జీ–20 దేశాల గ్రూపు అధ్యక్షస్థానంలో భారత్ పాత్ర అనే అంశాలపై పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ మిత్రబింధరావు ప్రారంభించారు. ఈ సందర్భం గా మిత్రబింధరావు మాట్లాడుతూ విద్యార్థులలో చదువుతోపాటు ఇతర రంగాలలో రాణించేలా, ప్రతిభ చాటే లా తయారు చేయడం కోసమే అన్ని రకాల పోటీలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పార్కింగ్ చేసిన ఆటో చోరీ

శంషాబాద్: పార్కింగ్ చేసిన ఆటోను అపహరించిన ఘటన ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం.. కొత్వాల్‌గూడకు చెందిన ఎం. వెంకటేష్ కూరగాయాల లోడును తీసుకొచ్చి గురువారం ఉదయం 6 గంటలకు పట్టణంలోని ఫ్లై ఓవర్ కింద పార్కింగ్ చేశాడు. కూరగాయలను మార్కెట్‌లోకి తీసుకెళ్లిన అరగంట తర్వాత వచ్చి చూసేసరికి ఆటో కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అన్నదానం.. మహాదానం



పట్టణంలోని ధర్మసాయి మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకం, హారతి, పల్లికిసేవ కార్యక్రమాల అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో వందలాదిమంది భక్తులు పాల్గొన్నారు. – శంషాబాద్

'జెర్మన్‌టెన్'లో మెరుగైన వైద్యసేవలు



మాట్లాడుతున్న డాక్టర్ మీర్ జావద్ జర్ ఖాన్

రాజేంద్రనగర్: అత్తాపూర్‌లోని జర్మన్‌టెన్ ఆసుపత్రిని సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రిగా తీర్చిదిద్దుతున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మీర్ జావద్ జర్ ఖాన్ వెల్లడించారు. గురువారం ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రోగులకు అత్యాధునిక వైద్య సేవలను అందిస్తున్నామన్నారు. గతంలో ఆర్థోపెటిక్ సేవలు అందించే వారమని ప్రస్తుతం సూపర్ స్పెషాల్టీ దిశగా అన్ని సేవలను అందిస్తున్నామన్నారు. 15 సంవత్సరాలుగా నగరంలోని వివిధ ఆసుపత్రుల్లో సేవలు అందించిన ఆర్థోపెటిక్ సీనియర్ డాక్టర్ ఖలీల్‌ఉల్లా ఇకపై జర్మన్‌టెన్‌లో సేవలను ప్రారంభించారన్నారు. ఇప్పటికే డాక్టర్ శ్యామ్ సుందర్, డాక్టర్ మధుబృందం ఆసుపత్రిలో సేవలు అందిస్తున్నారన్నారు. రోగులకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

11న 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమం

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సా. 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. 040– 23001234కు ఫోన్ చేయవచ్చు.

నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీని సభ్యులు

రాజేంద్రనగర్: కాలనీలోని అన్ని ఆలయాలను అభివృద్ధి చేసుకోవాలని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు టి.ప్రేమ్‌గౌడ్ అన్నారు. మధుబన్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.వి.కుమార్, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో కాలనీలోని గణేష్ మండపం ఆవరణలో పోచమ్మ దేవాలయ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రేమ్‌గౌడ్ మాట్లాడుతూ.. బోనాల ఉత్సవాలను కాలనీలోని అన్ని కమిటీలు కలిసి ఘనంగా నిర్వహించాలన్నారు. పోచమ్మ దేవాలయ నూతన కమిటీ అధ్యక్షుడిగా మహేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా గద్దె యాదగిరి, కోశాధికారిగా మేకల దుర్గాప్రసాద్, జాయింట్ సెక్రటరీగా శివాజీ ఎన్నుకున్నారు.

వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకే విమర్శలు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

శంషాబాద్: ఫ్లై ఓవర్ సమస్య పరిష్కారంపై ఇచ్చిన హామీ పక్కనపెట్టి తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ నేతలపై విమర్శలు చేయడం సిగ్గుచేటని కాంగ్రెస్ పట్టణ సీనియర్ నాయకులు బొబ్బిలి శేఖర్ ముదిరాజ్ అన్నారు. ఎంపీ ఇచ్చిన హామీ మేరకు పనులు ప్రారంభం కావాలన్న ప్రజల ఆకాంక్షలను ప్రభుత్వానికి తెలియజేయడానికి కాంగ్రెస్ పోరాడుతుందన్నారు. ఇచ్చిన హామీలను ప్రశ్నిస్తే గగ్గోలు పెట్టి తగిన సమాధానం చెప్పకుండా కాంగ్రెస్‌పై హెచ్చరికలు చేయడం తగదన్నారు.

చెరువులకు పూర్వవైభవం

ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



జలహారతి ఇస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, జిల్లా కలెక్టర్ హరీష్

శంషాబాద్: స్వరాష్ట్రంలో తెలంగాణ సర్కారు చెరువులకు కాకతీయుల కాలం నాటి పూర్వవైభవాన్ని తీసుకొచ్చిందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని తొండుపల్లి చెరువు వద్ద కౌన్సిలర్ చెన్నం అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ హరీష్ పాల్గొని జలహారతి ఇచ్చారు.

బండ్లగూడ/మణికొండ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం ఊరూరా చెరువుల పండుగ నిర్వహించారు. నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పీరంచెరువు వద్ద మహిళలు పెద్ద ఎత్తున హాజరై బతుకమ్మ ఆడారు.

- కోకాపేట కొత్త చెరువు, మణికొండ ఎల్లమ్మ చెరువుల వద్ద చెరువుల పండగను నిర్వహించారు. నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ రేఖయాదగిరి, వైస్ చైర్మన్ వెంకటేశ్‌యాదవ్, మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కమిషనర్లు ఎ. సత్యబాబు, కె. ఫల్గుణ్‌కుమార్ హాజరై ఎల్లమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు.



పీరంచెరువు వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు



ఊరూరా చెరువుల పండుగలో పాల్గొన్న మేయర్ మహేందర్‌గౌడ్



మణికొండలో బతుకమ్మలతో చెరువు వద్దకు వస్తున్న మహిళలతో వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి



కోకాపేటలో బోనాలతో ఉత్సవాల్లో పాల్గొన్న మున్సిపాలిటీ ప్రజాప్రతినిధులు



కోకాపేటలో..



మణికొండలో..